# అంగరక్షకుని డైలమా

"మా అన్నయ్య బ్యాక్‌గ్రౌండ్ ఏమిటో మీకు నిజంగా తెలియదా?"

మహీపాల్ నన్నా ప్రశ్న అడగడం నాలుగోసారి. స్టేషన్‌లో నన్ను రిసీవ్ చేసుకోవడానికి వచ్చిన దగ్గర్నుంచి అతను మాట్లాడిన మాటలే తక్కువ. వాటిల్లో ప్రశ్నలే ఎక్కువ. అందునా ఈ ప్రశ్న మరీ ఎక్కువసార్లు వేశాడు. ప్రతీసారీ నా జవాబు ఒక్కటే - తెలియదని.

అవును మరి, భూపాల్ గురించి నేను విన్నది కొంచెమే. నా ధైర్యసాహసాల గురించి ఆయన విన్నాడేమో మరి, బాడీగార్డుగా పని చేయమని ఆహ్వానిస్తూ కబురంపించాడు. నెలకి పదివేలు ఇమ్మని అడిగేను. సరేనని వారం క్రితమే కబురు, దానితో బాటు వచ్చేందుకు రైలు ఛార్జీలు వచ్చాయి. గ్రానైట్ రాళ్ల బిజినెస్ కదా, శతృవులు ఉన్నారేమో, మన అవసరం పడింది అనుకున్నా కానీ ఈ మహీపాల్ అడిగే తీరు చూస్తే ఏదో మిస్టరీ ఉన్నట్టు తోచింది. ఇక ఉండబట్టలేక అడిగేశా. ముందు కాస్సేపు మాట్లాడలేదు. కారు డ్రైవింగు మీద నుండి దృష్టి తప్పించలేదు. తర్వాత మెల్లగా అన్నాడు.

"అన్నయ్య ఛోటారామన్ గ్రూప్‌కి కాషియర్‌గా ఉండేవాడు" అన్నాడు.

"అతని స్మగ్లింగ్ ముఠా పట్టుబడడం, జైలు కెళ్లడం ఎప్పుడో పదేళ్ల మాట! ఇప్పుడెందుకు భయం?" అని అడిగేడు ఆశ్చర్యపడుతూనే.

"అతని ముఠాలో పట్టుబడనిది అన్నయ్య ఒక్కడే! సమయానికి జారుకున్నాడు. కొంత ఎక్కౌంటు సెటిల్ కాలేదు. అంటే అన్నయ్య దగ్గిర డబ్బుండిపోయిందని రామన్ అంటాడు. వాళ్లవాళ్లకు ఇయ్యమని జైలునుండే కబురంపించాడు. అదేమీ లేదంటాడు అన్నయ్య."

విషయం అర్థం కాసాగింది. ఆ స్మగ్లర్ల డబ్బుతోనే భూపాల్ బిజినెస్ ఆరంభించి, డబ్బు, పేరు గడించాడు. జైలు నుండి వాళ్ల బెదిరింపులు పంపుతూండడంతో సిటీలకు దూరంగా ఈ చిన్నటౌన్లో స్థిరపడ్డాడన్నమాట. మరి ఇన్నాళ్లూ సుఖంగా ఉన్నవాడికి ఇప్పుడు హఠాత్తుగా ప్రాణభీతి ఎందుకు పట్టుకుందో?

'క్రితం నెలలో వచ్చిన బెదిరింపు ఉత్తరం వల్ల' అన్నాడు మహీపాల్. రెండు రోజుల క్రితం ఛోటారామన్, అతని ముఖ్య అనుచరులు విడుదల కూడా అయ్యేరుట. ఏ క్షణాన్నైనా దాడి చేయవచ్చు. డబ్బు కోసం కాకపోయినా, పగతోనైనా ప్రాణం తీయవచ్చు.

"మరి భార్య, పిల్లలు? వాళ్లకు రక్షణ ఎవరిస్తారు? వేరెవరినైనా పెట్టారా?"

"అన్నయ్యకు ఫ్యామిలీ లేదు. పెళ్లి చేసుకోలేదు. సరదాగా కాలం గడిపేస్తాడు."

"మీరూ బాడీగార్డు ఎవర్నైనా ఏర్పాటు చేసుకున్నారా? కావాలంటే మా ఫ్రెండు ఒకడు..."

మహీపాల్‌కి కోపం వచ్చింది. "...నాకెవరూ అక్కర్లేదు. నేనసలు ఆ లైన్లో ఎప్పుడూ లేను. మా ఆవిడ అస్సలు ఒప్పుకోదు. మీకు తెలుసా, తను పోలీసు ఇన్‌స్పెక్టరుగా పనిచేసేది, నాతో పెళ్లయేక మానేసిందనుకోండి. మా అబ్బాయి రిషీవ్యాలీలో చదువుతున్నాడు. ఛోటారామన్‌కీ వాళ్లకీ తెలుసు, నా పద్ధతి. ఏదో చిన్న బిజినెస్ చేసుకుంటున్నాను. నా జోలికి ఎవరూ రారు." అన్నాడు రోషంగా.

"చిన్నదేమిటి లెండి? ఈ కారు చూస్తూంటే పెద్దదే అనిపిస్తోంది. మరి ఈ చిన్న ఊళ్లో ఎందుకున్నారు?" అని అడిగేను అతన్ని మెత్తపరుస్తూ.

"అన్నయ్య కోసం. ఎవరూ లేకపోతే వంటివాడయిపోతాడని, పక్కనే ఇల్లు కట్టుకున్నాను. వాడింటికి,

మా ఇంటికి మధ్య టెన్నిస్‌లాన్ ఒక్కటీ అడ్డమంతే! ఏంత చెడ్డా అన్నగారు. పైగా ఇదివరకటి ఏక్టివిటీస్ అన్నీ మానేసాడు. అప్పుడైనా తను డైరెక్టు ఆపరేషన్స్‌లో ఎప్పుడూ ఉండేవాడు కాదు. వెళ్లి డబ్బు కలక్ట్ చేసుకోవడం, ఇమ్మన్నవారికి ఇవ్వడం..."

"...ఈ ఉత్తరాలు వచ్చినప్పుడు పోలీసులకు చెప్పలేకపోయారా?" అని అడిగేను అతని వాక్ప్రవాహానికి అడ్డుకట్ట వేస్తూ.

"సర్లెండి, వాళ్లెంత ఘనులో మీకే తెలుస్తుంది. వాళ్లతో ఇమడలేకనే మా ఆవిడ రిజైన్ చేసింది. అదిగో, ఆ లాన్‌లో నడుస్తున్నదే మా అన్నయ్య. లెఫ్ట్ సైడ్ కనబడేది ఆయన ఇల్లు. రైట్‌సైడు మాది" అంటూ కారు ఆపేడు మహీపాల్.

కారు హారన్ విని ఇటు తిరిగి, మమ్మల్ని చూసి చేయి ఊపుతూ రాబోయిన భూపాల్ ఒక్కసారిగా తూలేడు. తుపాకీ చప్పుడు చెవులు గింగురుమంటూండగానే అతను కూలిపోతున్న దృశ్యం కంటబడింది. చప్పున పరిగెట్టాను. అతన్ని ఒళ్లో తీసుకుంటూండగానే తెలిసింది, ప్రాణాలు గాలిలో కలిసిపోయాయని. నేలకు జార్చి అటూ ఇటూ చూసాను. తుపాకీ ఎటునుండి కాల్చేరో తెలియలేదు. కాల్చి పారిపోతున్న జాడ కూడా - మనిషి పారిపోతున్నట్టో, కారు స్టార్టయి పరుగుతీసినట్టో - ఏమీ తెలియలేదు.

మహీపాల్ కొయ్యబారిపోయాడు. "అన్నయ్యా" అంటూ దగ్గరకు వచ్చి ఏడవబోయి, అంతలోనే ఏదో గుర్తుకు వచ్చినట్టు అన్నగారి ఇంటి లోపలికి పరిగెట్టాడు. అతను లోపలికి వెళ్లిన ఐదు నిమిషాలలోనే ఒక అమ్మాయి - బాబ్డ్ హెయిర్, నల్లకళ్లజోడు - పరిగెట్టుకుంటూ వచ్చి మహీపాల్ కారు కాక వేరే కారు తీసుకుని డ్రైవ్ చేసుకుంటూ వెళ్లిపోయింది హడావుడిగా. నేను బిత్తరపోయి చూస్తూండగా మహీపాల్ వచ్చాడు బయటకు.

"పోలీసులకు ఫోన్ చేశాను. వచ్చేస్తారు. మీరా శవాన్ని వదిలేసి లోపలికి రండి" అన్నాడు. చిత్రంగా అతని మొఖంలో నిశ్చింత కనబడినట్టయింది నాకు.

అదే అన్నాను నేను గదిలో సోఫాలో కూచుంటూ. "అబ్బే, ఛోటారామన్ ఉత్తరాలు వచ్చిన దగ్గర్నుంచి ఒకటే టెన్షన్, ఏమవుతుందాని. ఇప్పుడిక ఆ ఆందోళన లేదు. ఏమయిందో తెలిసిపోయింది కాబట్టి" అన్నాడు మహీపాల్ నవ్వు పెదాల మీదకు తెచ్చుకుంటూ.

"ఇంతకీ ఆ అమ్మాయెవరు?" అని అడిగేను రోడ్డు వైపుకు సైగ చేస్తూ.

"ఎవరయితే నేమి లెండి? రోజుకి నలుగుర్ని తెచ్చుకుంటాడు అన్నయ్య. పాపం మీరు వచ్చిన పని ప్రారంభించకుండానే అయిపోయింది. ఇంకో గంటలో బస్సు ఉంది. డ్రాప్ చేయమంటారా?" అన్నాడు మహీపాల్ సిగరెట్ వెలిగించుకుంటూ.

"బాడీ గార్డుగా వచ్చాను కదా, పోలీసులు వచ్చేవరకు ఆయన డెడ్‌బాడీకైనా కాపలాగా ఉంటాను లెండి. పోలీసులు వచ్చేలోగానే ఆ అమ్మాయిని పంపించేశారేం?" అన్నాను అతన్ని అదోలా చూస్తూ.

"పోతూ పోతూ ఉంపుడుకత్తె ఇంట్లో పోయాడన్న అన్న సామెతలా, దీని కారణంగా ఇంకో వ్యక్తి, ఎలాటిదైనా కానివ్వండి, ఇరుక్కోవడం ఎందుకని పొమ్మన్నాను. ఉన్నా సాక్ష్యం చెప్పేందుకు ఏమీ లేదు. మన కళ్లెదురుగానే హత్య జరిగింది. మనిషి రాలిపోయాడు. ఏం చేసినా తిరిగి రాడు."

"మీరు పొమ్మన్నా ఆమె ఎలాగూ ఇరుక్కుంటుంది. ఆ సోఫాలో పడి వున్న పులిచర్మం కోటు ఆమెదే అయి వుంటుంది. దాని సహాయంతోనైనా పోలీసులు పట్టుకుంటారు లెండి" అన్నాను అతని దృష్టిని దానికేసి మరలిస్తూ.

మహీపాల్ ఉలిక్కిపడ్డాడు. గబగబా వెళ్లి ఆ కోటును ఓ కవర్లో దాచేశాడు. పట్టుకెళ్లి తన కారు డిక్కీలో పెట్టేసి వచ్చేడు. తిరిగి వచ్చేసరికి నేను అక్కడే చిరునవ్వుతో నిలబడి ఉండడం చూసి కాబోలు, మండిపడుతూ, "మీకు ఇంక ఇక్కడేం పని? పోలీసులకు నేను చెప్పుకుంటాను లెండి. రిటన్ జర్నీకి డబ్బులిస్తాను. వెళ్లండి" అన్నాడు.

నేను చెక్కు చెదరలేదు. ఈ హత్యలో మహీపాల్ హస్తం ఉన్నట్టుంది అనిపించింది. "చూడండి,



ఛోటారామన్ ముఠా వాళ్ల నెక్స్ట్ టార్గెట్ మీరే కావచ్చు, భూపాల్ ఆస్తి మీకు దక్కుతోంది కాబట్టి. ఎలాగూ వచ్చాను. మీ బాడీగార్డుగా పెట్టుకోండి. అవే టెర్మ్స్. భోజనం, వసతి, పదివేల జీతం" అన్నాను నెమ్మదిగా.

"అక్కర్లేదు, చెప్పానుగా, మా ఆవిడ దుర్గ పోలీసు ఫోర్సు నుండి వచ్చిన మనిషి. నన్ను ఎలా కాపాడుకోవాలో ఆవిడకి బాగా తెలుసు. అదిగో వెయ్యి రూపాయలు. ఇక పదండి. పోలీసులొస్తే మీరెవరో చెప్పడం అదో పెద్ద బోరు."

డబ్బు అందుకుంటూ, "మరి ఆ పులిచర్మం కోటుకో?" అన్నాను, వంకరగా నవ్వుతూ. తిట్టుకుంటూ ఇంకో ఐదువేలు చేతిలో పెట్టాడు. నన్ను హడావుడిగా తరిమేయాలని అంత ప్రయత్నం చేసినా పాపం అది నెరవేరలేదు. నేను కదిలేలోగానే పోలీసులు రావడం, నా గురించి అడగడం, విచారణ తేలేవరకు నన్ను ఊళ్లోనే ఉండమని హుకుం చేయడం జరిగింది.

ఇదీ ఒకందుకు మంచిదే అనుకున్నా. చచ్చిపోయినా భూపాల్ నా క్లయింటు కిందే లెక్క. అతని హత్యలో మహీపాల్ పాత్ర తెలుసుకోవడం నా బాధ్యత. గుట్టు తెలుసుకున్నాక మహీపాల్‌ను పోలీసులకు పట్టివ్వాలా, లేక బ్లాక్‌మెయిల్ చేసి డబ్బు గుంజాలా అన్నది తర్వాత చూసుకోవచ్చు. ముందు ఈ బాబ్డ్ హెయిర్ పులిచర్మం కోటు పిల్ల ఈ ఊళ్లో ఉందో, లేక ఇంపోర్టెడ్ సరుకో తేల్చుకోవాలి. అంతకంటే ముందు మహీపాల్ పోలీసు భార్యను చూడాలి.

మాజీ పోలీసు, మాజీ పోలీసులాగానే ఉంది. మనిషి ఒకప్పుడు అందమైనదే కానీ, వంటి మీద కంట్రోలు తప్పింది. గొంతు కాస్త బొంగురు. బావగారి గురించి ఒక్క మంచిమాట చెప్పలేదు. మండల ముఠాకోర్ అంది. అతని ప్రభావం నుండి మహీపాల్‌ను తప్పించడానికి చాలా కష్టపడిందట. అసలు వాళ్ల పరిచయం కూడా తమాషాగా జరిగిందట. అన్నగారు చెప్పిన మీదట పోటీ వ్యాపారస్తుడిని కొట్టడానికి వెళ్లిన మహీపాల్‌ను పోలీసులు అరెస్టు చేసి స్టేషన్‌కి లాక్కొచ్చారుట. అక్కడ దుర్గ ఎస్.ఐ.ట. ఇతను స్వభావరీత్యా మంచివాడని గుర్తించి, వలచి, వలపించుకుని, పెళ్లాడి ఉద్యోగం మానేసి ఇంటిపట్టున ఉంటోందిట.

"ఆయన మీకంటే చిన్నవాడిలా ఉంటాడే!?" అనేశాను.

"అవును. ఐదేళ్లు చిన్న. నాకు ముందే పెళ్లయింది. పెద్ద ఉద్యోగం అని చెప్పి దగా చేసాడు. కడుపుతో ఉన్నానని తెలియగానే పారిపోయాడు. అప్పుడు నన్నుచూసి జాలిపడి మా పెద్దనాన్నగారు, పోలీసు కానిస్టేబుల్లెండి, ఉద్యోగం ఇప్పించారు. అలా, అలా పైకి వచ్చాను."

"అంతా బాగానే ఉంది. మీరు మహీపాల్‌ను సంస్కరించారని అనుకుంటున్నారు కానీ, భూపాల్ ఆస్తికి వారసుడిగా బోల్డంత డబ్బు వచ్చిపడుతోంది. మనిషి మారిపోతాడేమో చూడండి." అన్నాను అనుమానబీజాలు నాటుతూ. ఎందుకంటే మొగుడి మీద ఇంత నమ్మకం ఉన్న ఆడదాన్నుంచి సమాచారం రాబట్టడం కష్టం.

ఆవిడ మండిపడింది. "ఆ పాపిష్టి ఆస్తిలోంచి చిల్లిగవ్వ ముట్టుకోనివ్వను మహీపాల్‌ను. అసలా డబ్బు మీద మాకు ఆశ లేనే లేదు. అడ్డమైన బజారు ఆడవాళ్ల మీదే ఖర్చయింది అది ఇంతకాలమూ..."

"...ఇక మీద కూడా అలాగే ఖర్చయేట్టుంది."

దుర్గ తెల్లబోయింది. "ఏమిటి మీరంటున్నది?"

"మీరన్న ఆ బజారు మనుష్యులలో ఒకదాన్ని రక్షించడానికి మీ ఆయన తెగ కష్టపడుతున్నాడు..." ఎఫెక్ట్ కోసం మధ్యలో ఆపేను.

ఆవిడ భృకుటి ముడిపడింది. "ఎవరది?"

"పేరు తెలియదు. తెల్లగా, మీ లాగే పొడుగ్గా ఉంటుంది. బాబ్డ్ హెయిర్. నల్లకళ్లజోడు పెట్టుకుంది కాబట్టి మొహం గుర్తు సరిగ్గా తెలియలేదు. భూపాల్ చచ్చిపోయినప్పుడు అతని పడగ్గదిలో ఉంది. ఆమెను కాపాడడానికి మీ ఆయన మహా తాపత్రయపడుతున్నాడు. ఏముందో ఏమో?" ఒక్కోమాట మెల్లిగా, ఒత్తుతూ పలికేను.

ఆమె ఆలోచనలు సెటిలవ్వడానికి రెండు నిమిషాలు పట్టలేదు. చివరికి భర్త మీద నమ్మకమే జయించినట్టుంది. "ఏం ఫర్వాలేదు. మహీపాల్ అలాటివాడు కాదు. వాళ్ల అన్నగారి పరువు పోతుందని ఆ అమ్మాయిని పంపించేసి ఉంటాడు. ఎంతచెడ్డా ఫ్యామిలీ ప్రెస్టేజ్ అంటూ ఒకటి ఏడ్చిందిగా."

నా ధోరణి నేను మార్చలేదు. "ఆ అమ్మాయి దగ్గర పులిచర్మం కోటు ఒకటి ఉంది. మామూలుగా ఎవరూ బయట వేసుకోరు. 'ప్లేబాయ్' లాటి మేగజైన్‌లో సెంటర్‌స్ప్రెడ్ పిన్-అప్ గర్ల్స్ వేసుకుంటారు చూడండి, అలాటిది. అది ఆ అమ్మాయి అక్కడ మర్చిపోతే ఈయన తీసేసి తన కార్లో పెట్టుకున్నాడు. అది మాయం చేసేద్దామనో, లేక ఆ అమ్మాయికి పట్టుకెళ్లి ఇస్తాడో, అంటే ఆ అమ్మాయి ఎక్కడుంటుందో తెలుసన్నమాట!" ఇంకాస్త సమాచారం అందించాను.

కానీ అదేమీ దుర్గమీద ప్రభావం కనబరచలేదు. "అన్నగారి మాట జవదాటని లక్ష్మణుడు లెండి ఈయన. ఆయన ఎవరిని తీసుకురమ్మంటే వాళ్లని తీసుకురావడమే! దాన్ని బట్టి ఏమీ అనుకోవడానికి లేదు" అంటూ కొట్టిపారేసింది.

కానీ నేను కొట్టిపారేయలేక పోయాను. మహీపాల్‌ను వెంబడిస్తూనే ఉన్నాను. మూడోరోజున కొంత ఆచూకీ తెలిసింది, అతను ఒక ఇంట్లో అరగంట సేపు గడిపి బయట కొచ్చినప్పుడు. అతను వెళ్లిన కాస్సేపటికే నేను వెళ్లి తలుపు తట్టాను. తలుపు తీసిన వ్యక్తి మరెవరో కాదు! ఆ పులిచర్మం అమ్మాయే! ఆ రంగు, పొడుగు బట్టే కాదు, సోఫాలో పడి వున్న ఆ కోటు బట్టీ గుర్తించాను. అసలు ముందునుండి నాకు ఈమె మీదనే అనుమానం.

మధ్యలో సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌ను అడిగిచూశాను. భూపాల్‌ను పాతకాలం రైఫిల్‌తో దూరం నుండి కాల్చారట. గుండు ఎక్కణ్నుంచి వచ్చిందో తెలియలేదట. అలా కాల్చడంతో సిద్ధహస్తుడైన ఛోటారామన్ ముఠా మనిషి దగ్గర్లో మసలుతున్నాడా అని అడిగితే సర్కిల్ తెలియదన్నాడు. ఒకవేళ ఈ అమ్మాయి వాళ్ల తాలుకూ మనిషేమో. ఆమె సహాయంతోనే ఆస్తి కోసం మహీపాల్ హత్యచేయించేడేమో. ఆ ఆస్తిలో కొంత ఇచ్చి ఛోటారామన్ ముఠాతో సంధి చేసుకుంటున్నాడేమో!

ఈ అమ్మాయిని చూస్తే మాఫియా మనిషిలా మాత్రం అనిపించలేదు. నన్ను చూసి తలుపు మూసేయబోతూ ఉంటే చటుక్కున లోపలికి జొరబడ్డాను. అరవబోతే పిస్టల్ చూపించాను. భయపడితే జాలి చూపించాను. నిజాలు చెబితే ఏమీ చేయనన్నాను. చెప్పింది, నిజమో కాదో కానీ, తను ఒంటరి మనిషినని. ఆ రోజు భూపాల్ పిలిపించుకున్నాడని, పోలీసు ఫైల్ కెక్కి ముద్ర పడిపోకుండా మహీపాల్

కాపాడారని.

"కాపాడినందుకు ఇవాళ మూల్యం తీసుకున్నాడా?" అని అడిగేను హేళనగా. ఆమెకు కోపం వచ్చింది. "మా మధ్య అలాటి సంబంధం ఏమీ లేదు."

"పోనీ మన మధ్య ఏర్పడితే?" అన్నాను చటుక్కున. నాకు ఆడవాళ్లు కొత్త కాదు. ఆమె డ్రాయింగ్‌రూమ్‌లో పెట్టుకున్న తన ఫోటోలు, వేసుకున్న బట్టలు, కళ్లు తిప్పే తీరు ఇవన్నీ ఆమె తరహాను పట్టి ఇచ్చాయి.

ఆమె చూపులు నా దేహాన్ని తడిమాయి. చిరునవ్వు నవ్వుతూ, "...పడితే ముసలాళ్లతో నాకేం పని?" అంది. పిస్టల్ జేబులో పెట్టుకుని, ఆమెను దగ్గరకు తీసుకున్నాను. అభ్యంతరం చెప్పలేదు. చేతులతో నా ఛాతీని తడిమింది. నేను వంగి ముద్దు పెట్టుకున్నాను. "పేరేమిటి?" అడిగాను.

"చంచల"

"అదేం పేరు?"

"అమ్మ పెట్టిన పేరు లక్ష్మి. చంచల అన్నా కూడా లక్ష్మేటగా. మోడ్రన్‌గా ఉంటుందని మార్చుకున్నాను."

"మోడల్ కావలసినదానివి. మోడ్రన్ నేమ్ ఉండాలి. ఇక్కడ మగ్గితే ఏం లాభం?" అన్నాను ఆమెను అక్కున చేర్చుకుంటూ.

"అదే నేనూ అంటాను. అమ్మకు ఇష్టం లేదు. సిటీకి వెళ్లద్దంటుంది. అటువంటి ఆశలేమీ పెట్టుకోకుండా పెళ్లి చేసుకుని ఈ ఊళ్లోనే పడి ఉండమంటుంది. మీది మద్రాసటగా!" అంది ఆశగా. మహీపాల్ చెప్పి ఉంటాడు.

"అవును, రెండు సినిమాల్లో ఫైట్‌మాస్టర్‌గా పనిచేశాను కూడా. నాతో వచ్చెయి. సినిమాల్లో ఛాన్స్ రాకపోయినా యాడ్ ఏజన్సీలలోనైనా పని ఇప్పించగలుగుతాను" అన్నాను. అప్పటికే ఇద్దరం పక్కమీదకు చేరాం.

ఆమె ఎంత సంతోషపడిందో చెప్పలేను. అల్లుకుపోయింది. రేపే వెళ్లిపోదామంది.

"మరి మీ అమ్మ?"

"ఏం అమ్మ. నా తలకాయ! నా దగ్గరుంటే కదా! వేరే పెళ్లి చేసుకుని హాయిగా ఉంది. నాకు మాత్రం ఆంక్షలు పెడుతుంది. నాన్నెవరో ఎలాగూ తెలియదు. నా జీవితం నా ఇష్టం వచ్చినట్టు గడుపుతాను. నీలాటి వాడు పక్కన ఉంటే, పక్కలో ఉంటే నా దశే మారిపోతుంది. ఏ పోస్టర్ల మీద చూసినా నా బొమ్మే!" అంది ఉత్సాహంగా.

ఆ పైన అరగంట సేపు ఆమెను సుఖసాగరంలో ఓలలాడిస్తూనే ఎన్నో ప్రశ్నలడిగేను. ఎంత ప్రయత్నించినా తన దగ్గర్నుంచి భూపాల్ గురించి గానీ, మహీపాల్ గురించి గానీ, ఛోటారామన్ గురించి గానీ ఏ సమాచారమూ రాబట్టలేకపోయాను. గడుసుదే! చివర్లో చెప్పేశా – మాది మద్రాసు కాదని. సినిమాలతో నాకు సంబంధం లేదని. ఆమె బిత్తరపోయింది. తర్వాత ఫక్కుమని నవ్వింది. "పోన్లే, అది పోతే పోనీ కానీ, నువ్వు నాకు నచ్చావు. ఊళ్లో ఉన్నంతకాలం వస్తూ ఉండు. నిన్ను కాదనను" అంది. డబ్బు కోసం కాకుండా నన్ను నన్నుగా ఇష్టపడినవాళ్లను చూడడం ఇదే ప్రథమం! నాకెంతో ఆనందం కలిగింది.

కానీ ఆ ఆనందం రెండురోజులే ఉంది. మహీపాల్ హత్యలో కూడా చంచలకు భాగం ఉందని అనిపించడంతో! అవును. మహీపాల్‌ని ఎవరో చంపేశారు. ఒక సినిమా ప్రొడ్యూసర్‌ని కలవడానికి హోటల్‌కి వెళ్లిన మహీపాల్‌ని ఎవరో కత్తి పెట్టి పొడిచి చంపేశారు. ఆ టైముకి బాత్‌రూమ్‌లో స్నానం చేస్తున్న ప్రొడ్యూసర్, మహీపాల్ ఒక స్త్రీతో ఘర్షణ పడడం విన్నాడు. బయటకు వద్దామంటే బోల్టు వేసేసి ఉంది. శవం వద్ద దొరికిన లేడీస్ రుమాలుకి పూసిన సెంటు వాసన పట్టిచ్చింది. చంచల ఇంట్లో దిండు మీద అదే వాసన. నేను చెబితే పోలీసులు నమ్మరు. చెప్పాల్సింది మహీపాల్ భార్యే! ఆమె అందించిన సమాచారం బట్టే చంచల, ఆమె బట్టి ఛోటారామన్ ముఠా బయటపడతారు.

కానీ దుర్గ నేను చెప్పినది పట్టించుకోలేదు. మహీపాల్ హంతకురాలు స్త్రీ కావడానికి అవకాశమే లేదంది. ప్రొడ్యూసర్ పొరబడవచ్చుంది. రుమాలు, సెంటు పాతకాలం నాటి డిటెక్టివ్ నవలల సరంజామా అని కొట్టిపారేసింది. నేను నిస్పృహతో లేచాను. "నాకు తోచినది చెప్పాను. మీ ఇష్టం. నేను మాత్రం పోలీసులకు చెప్తాను. పులిచర్మం కోటు, భూపాల్ చచ్చిపోయినప్పుడు చంచల అక్కడున్న వైనం అన్నీ చెప్తా. ఆ తర్వాత అన్ని విషయాలూ వాళ్లే చూసుకుంటారు."

"ఒక్క నిమిషం" అంటూ లోపలికి వెళ్లి వచ్చిన దుర్గ చేతిలో పిస్తోలు చూసి అదిరిపడ్డాను. "నిన్ను పోలీసుల వద్దకు వెళ్లనివ్వడం ప్రమాదకరం" అందామె నా కేసి గురిపెడుతూ.

"అంటే, మహీపాల్ హత్య చేసిన స్త్రీ మీరా? మై గాడ్! నేను ఇలా ఎప్పుడూ ఆలోచించలేదు. ఇప్పుడు గుర్తొస్తోంది. భూపాల్‌ను చంపినది కూడా మీరే కావచ్చు. మీ ఇంటి నుండే రైఫిల్‌తో కాల్చి ఉండవచ్చు. ఆఫ్టరాల్, మీరు పోలీసు ఉమన్. ఇవి కాల్చడం మీకు బాగా వచ్చు. ఛోటారామన్ ముఠా ఉత్తరం కూడా మీ ఐడియాయే కావచ్చు. ఎందుకిదంతా? ఆస్తికోసమా?" అన్నాను అప్రయత్నంగానే చేతులు పైకెత్తుతూ.

దుర్గ మండిపడింది. "ఛ, ఆస్తి ఎవడికి కావాలి? నాక్కావలసినది నా కూతురి జీవితం బాగుపడడం. నేనెంత చెప్పినా అది విలాసాల వెంట పరుగులు పెడుతోంది. రంగుల కలలు చూపి అనుభవించాడు భూపాల్. అందుకే నా చేతిలో చచ్చాడు."

"ఎవరా కూతురు?"

"లక్ష్మి. చంచల అంటే నీకు తెలుస్తుంది. నా కన్నీ చెప్పిందిలే!"

"ఓహో, మొదటిభర్త ద్వారా కలిగిన అమ్మాయా? అంటే మహీపాల్‌కి కూతురు వరస. అయినా వాళ్లిద్దరి మధ్య..."

"...వాళ్లిద్దరి మధ్య ఏమీ లేదు. కానీ మహీపాల్ దాని మనస్సు చెడగొడుతున్నాడు. అన్నగారికి తార్చి, ఆస్తంతా దాని పేర రాయించుకుని, తర్వాత పబ్లిగ్గా కూతురుగా దత్తత చేసుకుని అది స్వంతం చేసుకుందామని ప్లాను. భూపాల్ చచ్చిపోయినా అతని ఆస్తి ముట్టుకోరాదని నేనడంతో కొత్త ఎత్తు ఎత్తాడు. చంచలను సినిమా నటి చేస్తాడట. ఎవడ్నో సినిమా ప్రొడ్యూసర్‌ను పిలుచుకు వచ్చాడు. వద్దని చెప్పినా వినలేదు. అందుకనే భర్త అని కూడా చూడకుండా చంపాల్సి వచ్చింది. మా అబ్బాయి సాయంత్రమే వస్తున్నాడు. వాడికివేమీ చెప్పకుండా చంచల నీ అక్కలాటిది అని చెప్పి ఇంటికి తీసుకు వచ్చి పెట్టేసుకుంటాను. నా కూతురి మీద ఇలాటి విషపు నీడలు పడకుండా కాపాడుకుంటాను" అంది దుర్గ.

"అంతా బాగానే ఉంది. మధ్యలో నన్ను చంపడమెందుకు?" అని అడిగేను దీనంగా.

"నీ వల్ల అంతా బయటపడేట్టుంది. నేను జైలు కెళ్లాల్సి వస్తుంది."

"మరి నాకేమైనా ఆప్షన్ ఉందా?"

"ఉంది. చంచలను పెళ్లి చేసుకొని నాకు అల్లుడు కావడం. లేదా నా చేతిలో చావడం."

చంచల మనస్సు, శరీరం గుర్తుకురాగా మొదటి ఆప్షనే ఎంచుకున్నాను నేను.